క్లుప్తంగా

వరాహావతారంలో దర్శనమిచ్చిన శ్రీవారు

రాయవరం: స్థానికంగా కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారు బుధవారం వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నెల 23 నుంచి వేంకటేశ్వర భక్తజన సంఘం ఆధ్వర్యంలో దశావతార మహోత్సవాలు నిర్వహిస్తున్న విషయం పాఠకులకు విదితమే. ఇందులో భాగంగా ఉదయం స్వామి వారిని వటపత్ర సాయి అవతారంలో అలంకరించారు.రాయవరం పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దశావతార మహోత్సవాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సాయిప్రసాద్‌కు బోస్ పరామర్శ


సాయిప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎంపీ బోస్, సూర్యప్రకాశ్

రామచంద్రపురం: మాతృవియోగంతో బాధపడుతున్న మున్సిపల్ కౌన్సిలర్, న్యాయవాది వాడ్రేవు సాయిప్రసాద్‌ను బుధవారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్‌లు పరామర్శించారు. పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, నాయకులు పెంటపాటి శ్రీను, పోతంశెట్టి కృష్ణ, నల్ల దుర్గారావు, మధు, తోట సూరిబాబు, సినీ నిర్మాత ఉజారి వీర్రాజు, చందమామ వాసు, న్యాయవాదులు ఆయనను పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు.

కేంద్రమంత్రి అమిత్ షాను పదవి నుంచి తొలగించాలి


ఒంటితాడిలో అంబేడ్కర్ మందిరం వద్ద ఆందోళనలో రాజబాబు తదితరులు

కాజులూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే పదవి నుంచి తొలగించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. బుధవారం ఒంటితాడిలో సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో రాజబాబు తదితరులు పాల్గొని ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర మంత్రి అమిత్‌షాపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యా గణపతి విగ్రహం ఆవిష్కరణ


పసలపూడిలో విద్యాగణపతి విగ్రహావిష్కరణ దృశ్యం

రాయవరం: మండలంలోని పసలపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యా గణపతి విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ పారిశ్రామికవేత్త తాడి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ ప్రాంతంలో విద్యా గణపతి విగ్రహాన్ని ఆవిష్కరించడం ఇదే ప్రథమమని శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఘనంగా రావులమ్మ వార్షికోత్సవం

అంబాజీపేట: గంగలకుర్రు గ్రామంలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా ఆలయం వద్ద ఏకాహం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

మండపేట మున్సిపల్ అధికారులు

కమిషనర్	9849905809
మేనేజర్	9849908186
డీఈ	9849769340
ఏఈ	9849906527
ఆర్వో	9849743832
ఆర్ఐ	7702155588
టీపీవో	9849986208
ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్	9849986209
ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్	9849639629
జేడీ పశు సంవర్ధక శాఖ	8985488562
హౌసింగ్ డీఈ	7093930423
హౌసింగ్ ఏఈ టౌన్	7093930491
రూరల్ సీఐ, టౌన్ ఇన్‌చార్జ్	9440796537
టౌన్ ఎస్సై	8332957926
లేబర్ ఆఫీసర్	9492555059
ఫైర్ ఆఫీసర్	9963727741
ఇన్‌చార్జ్ ఆర్టీవో	9154294653
పోస్టుమాస్టర్	08855231890
ఎక్సైజ్ సీఐ	9440902412
సబ్ రిజిస్ట్రారు	7093921407

నీటి పరీక్షలు నిల్

- పంచాయతీలకు కిట్లు ఇవ్వని ప్రభుత్వం
- కలుషిత నీటిని తాగి రోగాల బారిన పడుతున్న ప్రజలు


గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన నీటి శుద్ధి కిట్లు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: సురక్షిత తాగునీరు అందించడాలనే లక్ష్యంతో పంచాయతీలకు గతంలో నీటి పరీక్ష కిట్లు ఇచ్చేవారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు కావస్తున్నా నీటి కిట్లు పంపిణీ చేయలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం సంవత్సరంలో మన దేశంలో 10 లక్షల మంది నీటి సంబంధిత వ్యాధులతో మరణిస్తున్నారు. కానీ మన అధికారులు మాత్రం నీటి పరీక్షలు చేయడం లేదు. విధుల నిర్వహణలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వం పంచాయతీలకు ఇచ్చే కిట్లులో నాళికలు, నమూనాను సేకరించే సీసా, నీటి పరీక్ష పద్ధతుల వివరణ బాక్స్, వివిధ పరీక్షలకు వినియోగించే రసాయనాల పెట్టె, బ్రష్‌లు ఇందులో ఉంటాయి. వీటి ద్వారా నీటి నమూనా సేకరణ, భౌతిక, రసాయనిక, బ్యాక్టీరియా పరీక్షలు, నీటిలో ఫ్లోరైడ్ శాతం పరీక్ష, నీటి సంబంధ వ్యాధుల గుర్తింపు పరీక్షలు జరపాలి. వేసవి కాలంలో నేలబావులు, చెరువులు, పూర్తిగా ఎండిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత నీటి పథకం నుంచి వచ్చే నీరు కూడా కనీసం ఫిల్టర్ చేయకుండా విడుదల చేస్తుంటారు. దీంతో నీటి కలుషితం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం ఏర్పడి 6 నెలల కావస్తున్నా ఇప్పటి వరకు ఈ కిట్లు అందించిన పాపాన పోలేదు. దీనిని బట్టి ప్రజల ఆరోగ్యంపై టీడీపీ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని పలువురు విమర్శిస్తున్నారు.

నీటి కాలుష్యంతో వచ్చే వ్యాధులు

నీటి కలుషిత మవడంతో ప్రజలకు టైఫాయిడ్, కలరా, అతిసార, నీళ్ల విరేచనాలు, రక్త విరేచనాలు, కామెర్లు, వాంతులు, కడుపులో నొప్పి, కాలేయం, కండరాలు దెబ్బతినడం, పోలియో, చిన్న పిల్లలకు అంటువ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

తాగునీటిని కాచి చల్లార్చిన తరువాత మాత్రమే తాగాలి. రంగు మారిన, మడ్డి వాసన ఉన్న నీటిని తాగకూడదు. నిల్వ ఉన్న నీటిని తాగకూడదు. నీటి పరీక్ష ఫలితాలకు అనుగుణంగా దిద్దుబాటు చర్యలు చేపట్టాక రక్షిత నీటిని తాగడం మంచిదని వైద్యులు అంటున్నారు.

అధికారులు స్పందించాలి



ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి పరీక్షలు చేయాల్సిన అవసరం ఉంది. స్వచ్ఛభారత్‌లో ఇది కూడా ఒక భాగంగా భావించాలి. నీటి పరీక్షల వివరాలు ఎల్లప్పుడూ ప్రజలకు తెలియజెప్పి కాపాడాల్సిన అవసరం ఉంది.

– దంగేటి వెంకటరమణ, ఉండూరు, రామచంద్రపురం మండలం

నేటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆధార్ వివరాలను నవీకరించేందుకు, నూతన ఆధార్ నమోదుకు వీలుగా ప్రత్యేక నవీకరణ కేంద్రాలను నిర్వహిస్తున్నట్టు బుధవారం ఎంపీడీఓ కె.రత్నకుమారి తెలిపారు. సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల తల్లిదండ్రులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 26న కపిలేశ్వరపురం 2, అంగర 1, నల్లూరు, 27న పడమర ఖండ్రిక, అంగర 2, వాకతిప్ప, 28న తాతపూడి, కోరుమిల్లి 2, మాచర గ్రామ సచివాలయాల్లో నవీకరణ శిబిరాలను నిర్వహించనున్నామన్నారు. ఆయా శిబిరాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్రలు ఆధార్ వివరాలను నవీకరణ చేస్తారని ఎంపీడీఓ రత్నకుమారి వివరించారు.

28న కౌన్సిల్ సమావేశం

రామచంద్రపురం: పురపాలక సంఘ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో ఈనెల 28న ఉదయం 11 గంటలకు సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు, కౌన్సిల్ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రాజ నీతిజ్ఞుడు వాజ్‌పేయి


కపిలేశ్వరపురంలో వాజ్‌పేయికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నేతలు


రామచంద్రపురంలో వాజ్‌పేయి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్ తదితరులు


కోటిపల్లిలో దుస్తులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మంత్రి వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం: దేశంలో రాజకీయాలకే వన్నె తెచ్చిన రాజ నీతిజ్ఞుడు, మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అటల్ బిహారీ వాజపేయి శత జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ వాజ్‌పేయి మానవతా విలువలు, అంకిత భావం, గొప్ప ఆదర్శ భావాలు కలిగిన వ్యక్తి అని కొనియాడారు. వ్యక్తిత్వం, సమర్థత, అనుభవం కలగలిపిన అజాత శత్రువుగా భారతదేశ ప్రజలందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. విలక్షణ రాజకీయ దురంధరుడిగా, సాహిత్యాభిలాషిగా, పాత్రికేయుడిగా, బహుభాషా కోవిదుడుగా కీర్తి ప్రతిష్ఠలు సంపాదించుకున్నారన్నారు. 1994లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గెలుచుకున్నారని గుర్తు చేశారు. నేటి తరం రాజకీయ నాయకులు వాజ్‌పేయిను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతిని బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు పాల్గొని మాట్లాడుతూ డిసెంబర్ 25న కేంద్ర ప్రభుత్వం సుపరిపాలన దినంగా ప్రకటించిందని ప్రతి సంవత్సరం వాజ్‌పేయి జయంతిని సుపరిపాలన దినంగా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం వాజ్‌పేయి జయంతి సందర్భంగా తపన ఫౌండేషన్ అధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి సహకారంతో పంచాయతీ కార్మికులు, పేదలకు బట్టలు పంపిణీ చేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రామచంద్రపురం రూరల్ అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, నాయకులు పసుమర్తి శ్రీరామ్, మణికంఠ, పెంటపాటి వీరబాబు, శ్రీవిష్ణు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాజులూరులో..

కాజులూరు: మాజీ ప్రధాని వాజ్‌పేయి పాలనతోనే దేశంలో రాజకీయ పురోగతి ప్రారంభమయిందని మండల బీజేపీ అధ్యక్షుడు సలాది వీరవెంకటసత్యనారాయణ అన్నారు. మండలంలోని శీలలో బుధవారం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుణ్యమంతుల శివాజీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిని కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నాయకులు వాజ్‌పేయి పుట్టినరోజు కేక్ కట్ చేశారు. పలువురు పేదలకు బట్టలు, దుప్పట్లు, పండ్లు, రొట్టెలను పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేవు పట్టాబి, పోలిశెట్టి శ్రీనివాస్, నరాల వెంకటరమణ, పితాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడిలో..

మండపేట: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని ద్వారపూడిలో బీజేపీ నాయకులు ఘనంగా బుధవారం నిర్వహించారు. ద్వారపూడి బీజేపీ నాయకులు వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే విదేశీ పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా వెళ్లిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అక్కడ వాజ్‌పేయి జయంతి నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ కన్వీనర్ కంకటాల మురళీకృష్ణ, నాయకులు యరగతపు అమ్మన్న, ముత్యం మణికంఠ, నీల సత్యనారాయణ, గుత్తుల సూర్యనారాయణ, బొడ్డు నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి బీజేపీ నాయకులు బుధవారం నివాళి అర్పించారు. ఆయన జయంతిని పురస్కరించుకుని కపిలేశ్వరపురంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ మండల అధ్యక్షులు నామాల శ్రీనివాస్, నాయకులు తోరం రాము తదితరులు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి జీవితాంతం కృషి చేసిన నేతగా, భారత ప్రధానిగా వాజ్‌పేయి అందరికీ ఆదర్శమన్నారు.

విద్యుత్ చార్జీల మోతపై రేపు వైఎస్సార్ సీపీ నిరసన


ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచిందని వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో ఇసుక దొరక్క ఏడు నెలలుగా భవన నిర్మాణ రంగం చతికిలపడితే మరోపక్క రైతన్నకు ఇస్తానన్న పెట్టుబడి సాయం అందించక పోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయి కార్మిక, కర్షకులు దిక్కుతోచని స్థితిలో ఉన్నార న్నారు. దీనికితోడు మూలిగేనక్కపై తాటిపండు పడ్డట్టు విద్యుత్ చార్జీల భారం మరింత కుంగదీసిందన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు, ప్రజలకు అండగా నిలబడటానికి వైఎస్సార్‌సీపీ విద్యుత్ చార్జీల పెంపుపై పోరబాటకు సిద్ధమైందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు రేపు అనగా శుక్రవారం విద్యుత్ చార్జీల పెంపుపై ఆందోళన చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంతా శుక్రవారం ఉదయం 10 గంటలకు మండపేటలోని వైఎస్సార్ కార్యాలయానికి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు భారీగా తరలివచ్చి నిరసన తెలపాలని ఎమ్మెల్సీ తోట పిలుపు నిచ్చారు.


నేషనల్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో రోహిత్ ప్రతిభ


నేషనల్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన రోహిత్

కాజులూరు: జమ్మూకశ్మీర్‌లో జరిగిన సబ్ జూనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన దున్నా రోహిత్ కాంస్య పతకం, అవార్డులు సాధించినట్టు గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్ఎస్‌బీ సుశీలామణి తెలిపారు. ఈ మేరకు బుధవారం గ్రామంలో ఆమె మాట్లాడుతూ జమ్మూకశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో ఈ నెల 20 నుంచి 24 వరకూ 37వ సబ్ జూనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తృతీయ స్థానం సాధించిందన్నారు. రాష్ట్ర టీమ్‌లో తమ పాఠశాలకు చెందిన దున్నా రోహిత్ పాల్గొని చక్కటి ప్రతిభ కనపరచి కాంస్య పతకం, ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందుకున్నాడన్నారు. రోహిత్‌కు శిక్షణ ఇచ్చిన పీడీ సునీల్‌కుమార్‌ను స్కూల్ హెచ్‌ఎం ఎస్ఎస్‌బీ సుశీలామణి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొల్లిశెట్టి సత్యం, సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి, ఎంపీటీసీ జొన్నకూటి పద్మ, పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

క్రీస్తు సందేశమే శాంతి మార్గం

- అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు


తోటపేట రోమన్ కేథలిక్ చర్చిలో వేసిన క్రీస్తు జననం సెట్టింగ్


ద్రాక్షారామ గుడ్ న్యూస్ చర్చిలో సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారుల నృత్యాలు


రాయవరం మండలం కూర్మాపురంలో శాంతాక్రజ్ వేషధారణల్లో అలరించిన చిన్నారులు

కె.గంగవరం: మండల వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అన్ని చర్చిలు క్రిస్మస్ శోభతో కళకళలాడాయి. మంగళవారం రాత్రి నుంచే ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ఏసుక్రీస్తు జననంపై ఆయా ప్రార్థనా మందిరాల పాస్టర్లు సందేశమిచ్చారు. పిల్లలు, యువత, పెద్దవారితో చర్చిలు కిక్కిరిసిపోయాయి. కొవ్వొత్తులు చేతపట్టి మధురగీతాలు ఆలపించారు. పాస్టర్లు, ప్రముఖులు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు, యువత ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వివిధ చర్చిల్లో శాంటాక్లాజ్‌లు సందడి చేశారు. క్రైస్తవ విశ్వాసులు క్రీస్తు జననానికి సూచికగా నక్షత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. మండలంలో అముజూరు మన్నా చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్స్ ఫెలోషిప్ ఫౌండర్ ఎం.జాన్‌బాబు మాట్లాడుతూ క్రీస్తు మార్గమే శాంతిమార్గమని సందేశమిచ్చారు. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. కె.గంగవరంలోని చిన్నమంద మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేశారు. పాస్టర్ సలాది జకర్య, పలు ప్రాంతాలకు చెందిన పాస్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. పలు చర్చల్లో క్రీస్తు జన్మదినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ చర్చల్లో పాల్గొని క్రీస్తు జననంపై గీతాలు ఆలపించారు. క్రైస్తవులు ఏసు పుట్టినరోజు కేక్‌లను కట్ చేసి భక్తులకు పంచారు. మండలంలోని గొల్లపాలెంలో సత్య సాయి భజన మండలి సభ్యులు వేకువజామున కొవ్వొత్తులతో నగరకీర్తన నిర్వహించి క్రిస్మస్ నిర్వహించారు. పలువురు హిందూ, ముస్లింలు సైతం క్రైస్తవులకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు చర్చిల్లో బుధవారం క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని తాకాయి. అర్ధరాత్రి వరకు చర్చిల్లో క్రైస్తవులు క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యువతీయువకులు, చిన్నారుల కేరింతల మధ్య కేక్ కటింగ్‌లు, ప్రత్యేక గీతాల ఆలాపనలు, డాన్స్‌లతో ఉత్సాహంగా గడిపారు. తోటపేటలోని రోమన్ కేథలిక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఫాదర్ జోసెఫ్ ప్రభాకర్, ఫాదర్ శీలం విమల్‌రాజుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లోక రక్షకుడు శాంతి కొరకు పరలోకం నుంచి మానవాళికి సందేశం ఇచ్చేందుకు మానవరూపంలో ఏతెంచారని పాస్టర్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. తోటపేట పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ద్రాక్షారామలోని గుడ్‌న్యూస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలోని చర్చిలో పాస్టర్ డాక్టర్ రెవరెండ్ జాన్ బెన్నీ ఆధ్వర్యంలో విశ్వాసులు ఉత్సాహంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకున్నారు. చర్చి ఆవరణలో క్రీస్తు జననం సెట్టింగ్‌ను అందంగా తీర్చిదిద్దారు. పాస్టర్ జాన్‌బెన్నీ, ఉషారాణి దంపతులు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం బహుమతులు అందజేశారు. రావిచెరువు, ఆదివారపుపేట గ్రామల్లో రాక్ చర్చి పాస్టర్ కనికెళ్ల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్‌మస్ వేడుకగా నిర్వహించారు. పాస్టర్ ఆనంద్‌కుమార్ లోక రక్షకుడు క్రీస్తుపుట్టుక గురించి, ప్రజల కోసం ఆయన చేసిన బలిదానం గురించి తెలుపుతూ క్రిస్మస్ సందేశం వినిపించారు. చిన్నారులు ప్రదర్శించిన ఆటపాటలు, నాటికలు అలరించాయి. అనంతరం వద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రేమ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బాపనయ్య చెరువు, మట్లచెరువు, ఆదివారపుపేట గ్రామాల సంఘస్థులు పాల్గొన్నారు.

మండపేట మండలం, పట్టణంలో..

మండపేట: మండపేట మండలం, పట్టణంలో క్రిస్మస్ వేడుకలను విశ్వాసులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆర్‌సీఎం, లూథరన్, బాప్టిస్టు చర్చిలలో మూడు రోజుల ముందుగానే క్రిస్మస్‌కు స్వాగతం పలికారు. చలిగాలుల ప్రభావం ఉన్నప్పటికీ విశ్వాసులు ఆయా సంఘాలకు మంగళవారం రాత్రి సమూహాలుగా వెళ్లి భక్తి శ్రద్ధలతో లోక రక్షకుడైన ఏసుక్రీస్తును ఆరాధించారు. యువతీ, యువకులు నాటికలు, క్రైస్తవ నృత్యాలు, క్రిస్మస్ తాత హడావుడితో మంగళవారం రాత్రి మండపేట పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. కొవ్వొత్తులు చేత పట్టుకుని హ్యాపీ క్రిస్మస్ అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.ఆయా చర్చిలలో లోక రక్షకుని జనన విధానం, ఆయన రాకడ విశేషాలతో బోధకులు సందేశాలు అందించారు. విశ్వాసులు తమ ఆలయాల్లో కానుకులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. క్రిస్మస్ చెట్లు, విద్యుత్ దీపాలంకరణలు, క్రీస్తు జన్మదిన ఫ్లెక్సీలు చర్చి ఆవరణల్లో కనువిందు చేశాయి. క్రిస్మస్ గీతాలతో ఆరాధనలు, ఆటపాటలతో మంగళవారం రాత్రి ఒంటిగంట వరకూ మండలంలోని అన్ని చర్చిలు క్రిస్మస్ వేడుకను జరుపుకున్నారు. తాపేశ్వరంలోని సోల్జర్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ మినిస్ట్రీస్ చర్చిలో బిషప్ డేనియల్ పాల్ 300 మందికి వస్త్రదానం చేశారు. వృద్ధులకు, పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

శ్రీ ఏసు కరుణాలయంలో

రాయవరం: ప్రభువైన ఏసుక్రీస్తు సందేశమే శాంతి మార్గమని పారిశ్రామికవేత్త చైతన్య రాజబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్రి వెంకటరెడ్డి (కృష్ణ) పేర్కొన్నారు. మండలంలోని పసలపూడి కళానగర్‌లోని శ్రీఏసు కరుణాలయంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు తన జన్మదినం ద్వారా ప్రపంచానికి శాంతి సందేశాన్నిచ్చారన్నారు. రాయవరంలో అపోస్టలిక్ చర్చి పాస్టర్ గొడుగు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. రాయవరం చాణక్య ఆస్పత్రి అధినేత డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి, పాస్టర్ జాయల్, దంత వైద్యురాలు బెల్లపు నీరజ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులు, పెద్దలు ప్రత్యేక క్రైస్తవ గీతాలు ఆలపించడమే కాకుండా నాటికలు ప్రదర్శించారు. మంగళవారం రాత్రి నుంచే చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేయడంతో పాటు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కూర్మాపురం సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో చిన్నారుల నుంచి పెద్దల వరకు నూతన వస్త్రాలు ధరించిన క్రైస్తవ సోదరులు ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు శాంతాక్రజ్ వేషధారణలతో అలరించారు. విద్యుద్దీపాలంకరణతో పలు చర్చిలు కళకళలాడాయి. మండలంలోని రాయవరం, లొల్ల, వెదురుపాక, వి.సావరం, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


అముజూరు మన్నా చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న చిన్నారులు


తాపేశ్వరం చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు


గొల్లపాలెం చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు


పసలపూడి క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న అతిథులు